"క్రాసా సైకిల్ గల్లంతు!" అంటూ వచ్చాడు రామకృష్ణ.

"అయితే ఇది రెండో వికెట్టన్నమాట!" అన్నాడు గేమ్సుబాండ్ భవానీప్రసాద్.

# సైకిల్ గల్లంతు

రెంటాల సత్యనారాయణ

"కాసాకు రెండు సైకిళ్ళున్నాయా?" అంటూ దీర్ఘంతీశాడు శంకర్రావు.

"వాడుకోడానికి ఒక సైకిలూ, పోగొట్టుకోడానికి మరో సైకిలూ. ఇట్లా వుండవండీ ఎవరికీ! ఈ వారంలో ఇది రెండో కేసు. మొన్ననేగా మన 'మేక' సైకిల్ పోయింది" అన్నాడు తారకరాం తాపీగా.

ఈ 'మేక' పూర్తిపేరు మేచుపు కనకయ్య. మనిషి పరమ సాధువు! అందుకే మా ఆఫీసులో అందరూ అతణ్ణి ముద్దుగా "మేక" అని పిలుస్తూంటారు. అతడు ఇటీవలనే సైకిల్ అడ్వాన్సు తీసుకుని. తాను దాచుకున్న డబ్బు కూడా కొంత కలిపి ఎలాగైతేనేం ఓ కొత్త సైకిల్ కొనుక్కున్నాడు. అతని ఇంటికీ, ఆఫీసుకూ చాలా దూరం. అందుకే అతనికా సైకిలు చాలా అవసరం

"ఇది ఎవరి 'క్యాచ్' అయ్యుంటుం దబ్బా?" అన్నాడు గేమ్సుబాండ్.

"ఇదంతా చలమయ్య చలవే! ఇందులో ఏం సందేహం లేదు భోజనానికింటి కెళ్ళొస్తాను. ఓసారి సైకిలివ్వు అని అడిగుంటాడు. ఈ 'మేమే' గాడిచ్చేసుంటాడు ఇప్పుడు సైకిలడిగితే చలమయ్య 'బెబ్బే' అనుంటాడు" అన్నాడు తారకరాం

"సైకిల్ వనిత. విస్కీ విత్తం...." అంటూ మొదలెట్టాడు శంకర్రావ్.

"చలం హస్తం గతం గతః" అంటూ దాన్ని పూర్తిచేశాడు రామకృష్ణ.

"ఈ స్కోరు చలమయ్యదేనని ఎలా కనిపెట్టావ్ గురూ?" అన్నాడు గేమ్సుబాండ్.


లంచ్ టైం అయింది. అందరం తారకరాం చుట్టూ చేరాం.

"చలమయ్య బుట్ట.... అంటే అంతే మరి" అన్నాడు రామకృష్ణ.

'బుట్ట' అనేది చలమయ్య ఇంటిపేరు. ఆ పేరును సార్థకం చేస్తున్నాడు చలమయ్య

తారకరాం చెప్పడం మొదలెట్టాడు—

"దీనికి పెద్ద లాజిక్ చదవక్కర్లేదు. డిటెక్టివ్ నవల్సు భట్టీయం చెయ్యక్కర్లేదు భాయీ! మన చలమయ్య గజాటగాడని మనకు తెలుసుగదా! జూదంలో లాగా పేకాటలో కూడా వస్తువులీ. ఆస్తుల్నీ. చివరకు మనుషుల్నీ పందెంలో పెట్టొచ్చుగదా. పందెంలో పెట్టడానికి మన చలమయ్యకు సొంత తమ్ముళ్ళుగాని. అద్దె తమ్ముళ్ళుగానీ లేరు. అరువు భార్యా లేదు. సొంత సైకిలూ లేదు. ఇక పోతే మన మేక భార్య. మేక లాగా గానీ, వాడి సైకిల్లాగాగానీ నోరు లేందేంగాదు. ఆవిడ నోరు విప్పిందంటే ఆ పేట పేటంతా హడలి చస్తుంది. ముందు 'బుట్ట' పుట్టి తర్వాతగదా చలమయ్య పుట్టాడు! అందుకే మేకను బుట్టలో పెట్టి, సైకిల్ని తాకట్టులో పెట్టాడు."



"అదిసరే ఈ కాసా అసలే కార్చిచ్చు గదా ఆ తాటాకు బుట్టలో అతడెట్లా పడ్డాడండీ బాబూ!" అన్నాడు శంకర్రావు.

"అదేనండీ అసలర్థం గావడంలేదు." అన్నాడు తారకరాం.

"సైకల్ని కైంకర్యం చేయడంతో, ఇక ఈ బుట్ట తగలబడడం మాత్రం ఖాయం!" అన్నాడు రామకృష్ణ

కాసా మా ఆఫీసుకొచ్చి రోజులే అయింది. కానీ. అతణ్ణిగూర్చి మేం వినని రోజంటూలేదు కాసా యిలాటి మోసగాళ్ళ పాలిటి కార్చిచ్చు! అతను ఎంత మిత భాషంటే, అతణ్ణిగూర్చి యింతకు మునుపే వినుండబట్టిగానీ, లేకుంటే అతడొక మూగవాడనే మేమంతా భావించేవాళ్ళం. గొప్ప తమాషా యేమిటంటే ఇంతవరకూ అతని నోరుగాని, అతని సైకిలుగాని ఎల్లా వుంటాయో మేం వినడంగాని. చూడడంగానీ తటస్థించలేదంటే నమ్మండి.

తారకరాంవల్ల యింకో విషయం కూడా తెలిసింది. చలమయ్య డబ్బుల కోసం పరుగులు తీయడానికిగల కారణాల్లో ఇది కూడా ఒకటి కావచ్చు.

మొన్న సంక్రాంతి బొమ్మల కొలువుకు తారకరాం భార్య పేరంటం పిలుస్తూ చలమయ్య ఇంటికి కూడా వెళ్ళిందట. ఆవిణ్ణి చూడగానే "మా నాన్న ఇంట్లో లేడండీ" అన్నాడట చలమయ్య ఆరేళ్ళ కొడుకు.

ఆ మాటలకు తారకరాం భార్య విస్తుపోయిందట!

"మీరు మరోలా భావించకండి వదినగారూ! నాకోసం కూడా ఆడవాళ్ళు వస్తుంటారని మా వసి వెధవకు తెలీదు" అని సర్దేసిందట చలమయ్య భార్య.

కొంతసేపటికి శంకర్రావు నా దగ్గరకు వచ్చి "ఏమండోయ్! తాజా వార్త. ఇప్పుడు కాసాగారెక్కడికెళ్ళారో తెలుసా? సైకిలు పోయిందని ఆయన పోలీసు రిపోర్టు ఇచ్చాడటగదా. ఆ విషయం ఎందాకావచ్చిందో తెలుసుకోడానికి అక్కడికే బయల్దేరాడట. ఈ పని చలమయ్యే చేశాడనికూడా ఆ రిపోర్టులో ఉందటండీ!" అన్నాడు.

"ఇదేం మజాకానా! లేకపోతే అల్లాటప్పా గోంగూరనుకున్నారా!" అన్నాడు రామకృష్ణ

ఈమాటే నిజమయితే ఇక చలమయ్య దొరికిపోవడం ఖాయం! ఎందుకంటే ఈ విషయంలో మా ఆఫీసులో. ప్రతీ సాక్ష్యమూ చలమయ్యకు వ్యతిరేకంగానే పలుకుతుందనడానికి ఏమాత్రం సందేహం లేదు అతను సంపాదించిన ఖ్యాతి అంతటిదీ మరి! సైకిళ్ళు తాకట్టుపెట్టి పేకాడ్డం చలమయ్యకు కొత్తేమీ కాదు. ఆ సైకిళ్ళు పోగానే కొంతకాలం గైర్‌హాజరు కావడం కొత్తకాదు. ఆ సైకిళ్ళ తాలూకు అసలు యజమానులు నోరు మూసుకోవడమూ కొత్తకాదు. కానీ, అంత అపురూపమైన సైకిల్ పోయినా కాసా నోటివెంట కనీసం ఒక్క అక్షరం కూడా రాకపోవడమనేది మా అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించిన పెద్ద ఆశ్చర్యం!

ఇంతలో గేమ్సు బాండ్ గెంతుకుంటూ వచ్చాడు.

"మన కాసాగారు ఒక కంప్లైంట్ డైరెక్టుగా హెడ్ క్వార్టర్సుకే. బౌల్ చేశారటండీ గురువుగారూ! ఇక చలమయ్య వికెట్లు పడిపోయినట్లే!" అన్నాడు.

ఎలక్షన్ రిజల్ట్సుకంటే స్పీడుగా దొర్లిపోతున్నాయి సంఘటనలు.


"ఇక సైకిలూ మిథ్యే.... దొరకడమూ మిథ్యే!" అన్నాడు శంకర్రావు.

"వేదాంతం ముదిరినా. శంకర్రావుగారు ముదిరినా పనికిరావండోయ్!" అన్నాడు రామకృష్ణ.

"మన చలమయ్య గేమ్సు అసలు గెలవడమంటూ ఉండదా?" అన్నాడు గేమ్సుబాండ్.

తారకరాం అందుకున్నాడు. "ఎందుకుండదూ! అందులోనూ అతను గజాటగాడయ్యె. వరుసబెట్టి గెలుస్తాడు. కానీ. ఆ చలమయ్యతో వచ్చిన చిక్కల్లా ఒక్కటే. గెలచానుగదాని ఆట ఆపడు. ఓటమి పరంపరగా ఎదురవుతున్నదనుకోండి, ఓడినకొద్దీ పట్టుదల ఎక్కువవుతుంది. అంతేగాక మనవాడి ఆటలో ఒక ముఖ్య లక్షణం వుంది. ఓటమి మొదలైందా ఇక అతడ్ని దేవుడు కూడా గెలిపించలేడు. ఆ బ్రహ్మదేవుడు కూడా అతణ్ని కనీసం ఆటలోంచి ఇవతలకు లాగలేడు. అందువల్ల బయటకు వచ్చినా పూర్తిగా బయటకు రాడు కట్టూ.... జుట్టూ ఆటల్లోనే వదలిపెట్టి గోసాయిలా గోచీ మాత్రావశిష్టుడై మరీ బయటకు వస్తాడు."

"ఎట్లా వస్తాడూ!! మీ నమాసంలో




తప్పులు దొర్లినట్లున్నాయండీ!" అన్నాడు రామకృష్ణ.

"తప్పుడు మనిషినిగూర్చి మాట్లాడేటప్పుడు తప్పులుగాక ఒప్పులు దొర్లుతాయా ఏమిటి!! యథావం తప్పవతి గదండీ!" అన్నాడు శంకర్రావు.

ఆ మధ్య ఒకసారి ఆటలో ఓడిపోయి. సొమ్ము చెల్లించలేక, ఆట బాకీలు తీర్చలేక చచ్చేంత వాడయ్యాడు చలమయ్య. సమయానికి భార్య మంగళ సూత్రాలు రక్షించబట్టిగాని. ఇప్పుడా భార్యా రక్షించలేదు తన పసుపు కొమ్ముని నమ్ముకొని.

ఇద్దరిగా మారిన మా శ్రీమతిని తీసుకురావడానికి అత్తారింటి కెళ్ళాను. వెళ్ళక వెళ్ళక వెళ్ళానేమో వాళ్ళు నన్ను వెంటనే కదల నివ్వలేదు. అందువల్ల సెలవు పొడిగించాల్సి వచ్చింది.

ఒకరోజు— హఠాత్తుగా నాపేర ఒక కవరొచ్చేసరికి ఆశ్చర్యపోయాను. ఎప్పుడూ నేను ఒకరికి ఉత్తరాలు వ్రాయడంగాని, నాకు జవాబులు రావడంగాని అలవాటు లేదు. కవరు విప్పాను. అది శంకర్రావు నుంచి.

మీరు సెలవు పెట్టి వెళ్ళింతర్వాత చాలా చిత్రాలు జరిగిపోయాయి. ఇప్పుడు చలమయ్య మన ఆఫీసులో లేడు. ముఖం చెల్లక కాబోలు ట్రాన్స్‌ఫర్ చేయించుకు వెళ్ళిపోయాడు. అదేం మాయోగానీ మేకవరకూ అందర్నీ పల్టీలు కొట్టించిన చలమయ్య, అప్పు రొఖ్ఖం రెండొందల యాభై రూపాయలు కాసాగారి చేతిలో పెట్టి మరీ కదిలాడు. ఇంకో విచిత్రమేమిటంటే ఆ కాసాగారు ఆ పైకంలో పైసకూడా తాను ముట్టుకోకుండా మొత్తం.... మొత్తం.... మేకకు అందజేయడమే! ఈ మిస్టరీని మన సుప్రసిద్ద డిటెక్టివ్ నవలా పాఠకుడు శ్రీశ్రీశ్రీ తారకరాం కూడా విప్పలేకపోయాడు! మీరన్నా సాధించగలిగితే మేమంతా ఎంతో సంతోషిస్తాం. మీ జవాబుకోసం ఆదుర్దాగా యెదురు చూస్తున్నాం. అని వ్రాశాడు.

అప్పటికే మా శ్రీమతివల్ల నాకు ఒక ముఖ్య రహస్యం తెలిసింది. మా కాసాగారి శ్రీమతి. నా భార్య క్లాస్మేటట.

వెంటనే శంకర్రావుగారికి జవాబు వ్రాశాను

శంకర్రావుగారూ!

అసలు రహస్యమిది! ఇంతకూ అసలు ఆ సైకిలూ మిథ్యే.... ఈ పోవడమూ మిథ్యే! ఏమైనా మధ్యలో మన మేక కొంతలో కొంత అదృష్టవంతుడని చెప్పొచ్చు. ఎందుకంటే పోయిన సైకిలు ఎటుతిరిగీ మన మేకకు తిరిగిరాదు. పైగా పోగొట్టుకున్న మేక చలమయ్యతో పోట్లాడలేదు. ఈ సంగతి తెలిసిన కాసా తనకు సైకిలు లేకపోయినా తన సైకిలు చలమయ్యే తస్కరించినట్లు పుకారు పుట్టించాడు. కాసాకు అసలు సైకిలే లేదన్న విషయం తెలిసినా చలమయ్య బయటపెట్టడని భయపడ్డాడు. తాను సైకిళ్ళు కాజేస్తాడని కాసా కనిపెట్టాడనీ, కాసాను కదిలిస్తే తొంకంతా కదుల్తుందనీ, చలమయ్య తెలుసుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా ఆ డబ్బేదో కాసాకు ఇచ్చేస్తే గొడవ తప్పుతుందనుకున్నాడు. అదీ అసలు సంగతి.

కాసాగారి భార్యేగనక మా ఆవిడకు క్లాస్మేట్ కాకుండా ఉన్నట్లయితే ఆ కాసాగారి సైకిలుమాట దేవుడెరుగు, అసలు కాసాగారికి సైకిలు తొక్కడం కూడా రాదన్న సంగతి నాక్కూడా తెలిసుండేది కాదు!!!